# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506



**రిపోర్టర్స్ కావలెను**

నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యుమో పంపండి.

95150 34555
84979 20544



ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | గురువారం, 17 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 36 | పేజీలు: 4 | వెల:10/-




## తెలంగాణకు జపాన్ దిగ్గజం

# మరుబెనీ

- ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంసిద్ధం
- 1,000 కోట్ల పెట్టుబడి, దశలవారీగా 600 ఎకరాల్లో ఏర్పాటు
- తొలిరోజే కీలక ఒప్పందం కుదుర్చుకున్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం

TELANGANA RISING

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** జపాన్ పర్యటనలో ఉన్నముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం తొలి రోజునే కీలక పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకుంది. జపాన్‌కు చెందిన వ్యాపార దిగ్గజం మరుబెనీ హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధమైంది. టోక్యోలో మరుబెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి, ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. మరుబెనీ రూ. 1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో దశలవారీగా ప్రపంచ స్థాయి నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. ఈ ఒప్పందానికి సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ (letter of intent (LOI))పై ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మరుబెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు.

మిగతా 2 లో



## విందు భోజనం.. వృథా కావద్దని!

నూతన జంట వినూత్న ఆలోచన



## పిల్లలను నరికి ఆత్మహత్య చేసుకున్న తల్లి

జీడిమెట్లలో విషాద ఘటన

వివరాలు 2 పేజీలో..



# బాబోయ్.. బంగారం!

- పుత్తడి ధర హైజంప్
- ట్రంప్ టారిఫ్ దెబ్బకు స్టాక్స్ గగ్గోలు
- మదుపర్ల చూపంతా బంగారంపైనే
- లక్ష రూపాయలకు చేరువలో పసిడి
- పనుల్లేక పస్తులుంటున్న స్వర్ణకారులు
- పెళ్లిళ్ల సీజన్‌లో వెలవెలబోతున్న నగల దుకాణాలు





బంగారం.. పసిడి.. పుత్తడి.. కనకం.. స్వర్ణం.. పేరు ఏదైనా దానికుండే డిమాండే వేరు. పండుగ.. పబ్బం.. పెళ్లి.. పేరంటం ఏదైనా మగువల చూపు బంగారంపైనే. ఇది ఈనాటిది కాదు.. దాదాపు 5 వేల సంవత్సరాల నుంచి ఇది వాడుకలో ఉంది. క్రీస్తు పూర్వం 4000-2000 సంవత్సరాల మధ్యకాలంలో ఈజిప్ట్, మెసపొటేమియా ప్రాంతంలో బంగారం వాడకం ప్రారంభమైంది. మొదట్లో దీనిని నగలు, పూజల కోసం విగ్రహాలు వంటి వస్తువులను తయారుచేయడానికి మాత్రమే ఉపయోగించేవారు. ఆ తర్వాత క్రమంగా అది దర్పానికి చిరునామాగా, పెట్టుబడికి విలువైన వనరుగా మారింది. ఈ భూ ప్రపంచంలో ధర తగ్గని ఏకైక లోహం ఒక్క బంగారమే. ఇప్పుడీ బంగారం గురించి ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే.. ట్రంప్ పుణ్యమా అని 10 గ్రాముల బంగారం ధర ఏకంగా లక్ష రూపాయలకు చేరువైంది.

- హైదరాబాద్, నేటి ప్రస్థానం:

# పల్లె నుంచి పాన్ ఇండియా స్థాయికి..



ఓ బావా సైదులు అపవయ్యా పరుగులు అంటూ జానపద ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఓ పల్లెటూరి గాయనీ ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. చిన్నతనం నుంచే పాటలతో సహజీవనం చేస్తూ పాటల ప్రపంచం లో కొత్త గుర్తింపును తెచ్చుకుంది దాసలక్ష్మి.. ఆనాడేమన్నంటినా తిరుపతి నిన్న ఈనాడేమన్నంటినా తిరుపతి...తిన్నాతీరం పడుతలే..కూసున్న తీరం పడుతలే..ఏడున్న తీరం పడుతలే వంటి జానపద గీతాలతో అలరించిన లక్ష్మి తాజాగా విడుదలైన పుష్ప-2 చిత్రంలో వచ్చుండయ్ ఫీలింగ్స్ అంటూ పాడి పాన్ ఇండియా స్థాయి సింగర్ గా మారిన తీరు వెనుక తన ఇష్టాలు, కష్టాలను నేటి ప్రస్తానంతో ఇలా పంచుకుంది.

వివరాలు 3 పేజీలో..

నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం, 18 ఏప్రిల్ 2025




# తెలంగాణకు జపాన్ దిగ్గజం మరుబెనీ

మొదటి పేజీ తరువాయి

జపాన్ మరియు ఇతర మల్టీనేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తారు. దీని ద్వారా రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అంచనా ఉంది. మరుబెనీ ఇండస్ట్రియల్ పార్క్ ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి సారిస్తుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు నైపుణ్య ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీలో మరుబెనీకి స్వాగతం పలికారు. ఈ పార్క్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే తొలి ప్రాజెక్ట్ అవుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా తెలంగాణలో సుమారు 30,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు సృష్టించబడి, జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. తెలంగాణలో వ్యాపారానికి అనుకూలమైన అవకాశాలున్నాయని, మరుబెనీకి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని ముఖ్యమంత్రి గారు భరోసా ఇచ్చారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ భారతదేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా అభివృద్ధి చెందుతుందని, మరుబెనీ పెట్టుబడులకు ముందుకొచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. భారత్–జపాన్ స్నేహ బంధం దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను స్వస్థలంగా భావిస్తారని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిని విస్తరించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు ఎంచుకున్న వ్యూహాలు, వారి దార్శనికతను మరుబెనీ నెక్ట్స్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దయ్ సకాకురా గారు అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు తాము ఆసక్తిగా ఉన్నామని, అక్కడి అవకాశాలను వినియోగించుకునేందుకు ముందువరుసలో ఉంటామని సకాకురా గారు పేర్కొన్నారు. మరుబెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్, మొబిలిటీ వంటి రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50,000 మంది ఉద్యోగులను నియమించుకుంది.







# విందు భోజనం.. వృథా కావద్దని!

## నూతన జంట వినూత్న ఆలోచన

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** మనం అనేక వివాహాలకు వెళ్తుంటాం. వెళ్లిన ప్రతిచోట ఆహారం వృథా చేస్తుంటే చూసి బాధపడుతుంటాం. దీన్ని అరికట్టలేమా అని ఆలోచిస్తుంటాం. కానీ పెండ్లికి వచ్చిన ప్రతి ఒక్కరిని కలిసి చెప్పలేక కొన్నిసార్లు ఊరుకుంటాం. కానీ ఓ నూతన జంట మాత్రం వినూత్నంగా ఆలోచించింది! భోజనం వృథాను అరికట్టాలని కంకణం కట్టుకుంది. ఇంతకీ ఆ కొత్త జంట చేసిన పని ఏందంటే..

**ఈస్ట్ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోడూరి లక్ష్మీనారాయణ తన కుమారుడు నశిక్ వివాహం కీర్తితో జరిపించారు. అయితే వీరు ఈ వివాహ సమయంలో భోజన వృథాపై తీవ్రంగా ఆలోచించారు. ఎలాగైనా ఈ వివాహ సమయంలో వృథా తగ్గించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు రకరకాల ఉపాయాలు ఆలోచించారు. చించగా చించగా వారికి ఆలోచన తట్టింది. ఇప్పుడది అందరిని ఆకట్టుకుంటుంది.**


### కార్డుపై వడ్డించే వంటల వివరాలు..

నూతన దంపతులతో పాటు కుటుంబ సభ్యులంతా చర్చించుకొని చివరికి ఓ నిర్ణయానికి వచ్చారు. విందు భోజనంలో పెట్టే పదార్థాలు అతిథులకు తెలియదు.. అలాగే వడ్డించే వారికి సైతం కొన్ని పదార్థాల పేర్లు తెలియదు. తినే వారు ప్లేట్ పట్టుకొని వెళ్తుంటే పెట్టే వారు ఆ ప్లేట్‌లో పెడుతుంటారు. ఓ వేళ అతిథికి ఓ ఆహార పదార్థం నచ్చకపోతే తిసి వెంటనే హాల్‌లో పెట్టిన చెత్త డబ్బాలో పడేస్తాడు. ఆ పని అతిథులు చేయకుండా పెండ్లి పిల్ల,పెండ్లి పిల్లగాడి కుటుంబ సభ్యులు వెడ్డింగ్ కార్డుపై ఆహార మెనూ ముద్రించారు. ''ఇష్టం ఉన్న పదార్థాలనే పెట్టుకోండి.. పుష్టిగా భోజనం చేయండి.. ఇష్టం లేనివి అసలే పెట్టుకోకండి.. ఇలా మేం చెబుతున్నందుకు అన్యథా భావించొద్దు" అంటూ వినమ్రంగా అతిథులకు సూచించారు. ఈ పెండ్లికి మనం వెళ్లే అవకాశం లేదండోయ్! ఎందుకంటారా ఈ పెళ్లి ఏప్రిల్ 14న జరగ్గా.. ప్రస్తుతం మెనూ పొందుపర్చిన ఈ కార్డు నెట్టింట వైరల్ అవుతున్నది.




# బాబోయ్... బంగారం!

- పుత్తడి ధర హైజంప్
- ట్రంప్ టారిఫ్ దెబ్బకు స్టాక్స్ గగ్గోలు
- మదుపర్ల చూపంతా బంగారంపైనే
- లక్ష రూపాయలకు చేరువలో పసిడి
- పనుల్లేక పస్తులుంటున్న స్వర్ణకారులు
- పెళ్లిళ్ల సీజన్‌లో వెలవెలబోతున్న నగల దుకాణాలు



అంతర్జాతీయంగా, దేశీయంగా పుత్తడి ధర ఇప్పుడు జీవితకాల గరిష్ఠానికి చేరింది. ఆర్థిక ఉద్రిక్తతలకు తోడు అమెరికా, చైనా మధ్య అంతకంతకూ పెరుగుతున్న టారిఫ్ యుద్ధం నేపథ్యంలో పెట్టుబడులు మొత్తం బంగారంపైకి మళ్లుతున్నాయి. ఫలితంగా దేశీయంగా బంగారం ధర భగ్గుమంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర ఏకంగా రూ.98,400కు చేరింది. అంతర్జాతీయంగానూ ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 107 డాలర్లకు పైగా పెరిగి 3,330 డాలర్లకు చేరింది. ఈ స్థాయికి చేరడం చరిత్రలోనే ఇదే తొలిసారి. ఇక బంగారంతోపాటు పెరిగే వెండి ధర కూడా లక్ష రూపాయలకు చేరువైంది. కిలో వెండి ధర 98,900 వద్ద ట్రేడ్ అవుతోంది.

### ధర ఎందుకు పెరుగుతోంది?

అధిక సుంకాలు, వస్తువులు, ఖనిజాల ఎగుమతులపై ఆంక్షల ఫలితంగా అమెరికాలో టెక్ కంపెనీల షేర్లు, ప్రధాన సూచీలు నష్టపోతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా డాలర్ సూచీ 100 కంటే దిగువకు చేరడంతో పెట్టుబడులు డాలర్ నుంచి బంగారంపైకి మళుతున్నాయి. దీంతో బంగారం రేట్లు ఊహించని రీతిలో పెరుగుతున్నాయి. బంగారం ఒక వినియోగ వస్తువుగానే కాకుండా పెట్టుబడి ఆస్తిగా కూడా ఉపయోగపడుతోంది. స్టాక్ మార్కెట్లో వచ్చే ఒడిదొడుకులు కారణంగా జరిగే నష్టాలతో పోలిస్తే ఆర్థిక సంక్షోభ సమయంలో బంగారం మంచి లాభాలను ఇవ్వగలిగింది. ప్రపంచ దేశాలపై అమెరికా టారిఫ్‌లు ప్రకటించడంతో మదుపర్లు బంగారంపై పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఫలితంగా దాని ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బంగారానికి 'సేఫ్ హెవెన్ అసెట్'గా గుర్తుంపు ఉంది. ప్రపంచ దేశాల్లోని అన్ని కరెన్సీల్లో రికార్డు స్థాయిలో బంగారం ధరల పెరుగుదల కనిపించింది. ఇది ప్రపంచ స్థాయిలో బంగారంపై పెరుగుతున్న పెట్టుబడి విశ్వసనీయతకు నిదర్శనం.

### డిమాండ్ తగ్గని లోహం

సాధారణంగా మార్కెట్లో ధరలు ఎప్పుడూ సప్లై, డిమాండ్ సూత్రంపై ఆధారపడి ఉంటాయి. ఏదైనా వస్తువు సప్లై అధికంగా ఉన్నప్పుడు దాని ధర తగ్గుతుంది. సప్లై సరిపడా లేనప్పుడు డిమాండ్ పెరిగి ధర కూడా పెరుగుతుంది. అయితే, ఇప్పటి వరకు డిమాండ్ తగ్గని వస్తువు ఏదైనా ఉందంటే అది ఒక్క బంగారమే. దశాబ్దాలుగా దాని ధరలు పెరగడమే తప్ప నేల చూపులు చూసింది లేదు. ఒక్కోసారి దాని ధరలు స్వల్పంగా తగ్గినా అది తత్కాలికమే. ప్రస్తుతం బంగారం ధరల పెరుగుదల వెనక ప్రధానంగా నాలుగు అంశాలు కనిపిస్తున్నాయి. డాలర్ విలువలో తగ్గుదల కనిపించడం, అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం, ఈ వారంలో అమెరికన్ బాండ్ అమ్మకాలు భారీగా పెరగడం, అమెరికా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉండటం, అమెరికా ఆర్థిక వ్యవస్థలో వడ్డీ రేట్ల తగ్గింపు వార్తలు బంగారం గిరాకీకి కారణమయ్యాయి.

### పెళ్లిళ్ల వేళ తగ్గిన వ్యాపారం

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. వివాహాలు జోరుగా జరుగుతున్నాయి. సాధారణంగా పెళ్లిళ్ల వేళ బంగారం కొనుగోళ్లు ఊపందుకుంటాయి. కానీ, ఈసారి మాత్రం ధరల ప్రభావం బాగా కనిపిస్తోంది. నగల దుకాణాలు బోసిపోతున్నాయి. ఇక, బంగారం పనిపై ఆధారపడే స్వర్ణకారులు పనుల్లేక అల్లాడిపోతున్నాయి. రోజు గడవక ఇబ్బంది పడుతున్నారు. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో పెద్ద ఎత్తున వ్యాపారం జరిగేదని, ధన త్రయోదశి వంటి రోజుల్లో ఖాళీ ఉండేది కాదని, ఈసారి మాత్రం ఈగలు తోలుకోవాల్సి వస్తోందని నగల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గ్రాము బంగారం కొనుగోలు చేయాలన్నా రూ. 10 వేలు అవసరమని, చిన్నపాటి వస్తువు కొనుగోలు చేయాలన్నా మూడు, నాలుగు గ్రాములు ఉంటుందని చెబుతున్నారు. దీంతో ఎవరూ బంగారం షాపులవైపు చూడటం లేదని, బదులుగా వన్ గ్రామ్ గోల్డ్‌వైపు పరుగులు పెడుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

### బంగారం ధరలు పెరగడానికి కారణాలు

- ప్రభుత్వం లేదా ఆర్థిక మార్కెట్ల గురించి ప్రజలకు అనిశ్చితి ఉన్నప్పుడు బంగారం ధరలు పెరుగుతాయి.
- ఆర్థిక లేదా భౌగోళిక రాజకీయ సంక్షోభ సమయాల్లో బంగారాన్ని సురక్షితమైన స్వర్గధామంగా చూస్తారు.
- ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ తగ్గింపునకు వ్యతిరేకంగా బంగారాన్ని ఒక హెడ్జ్‌గా భావిస్తారు. కరెన్సీ హెచ్చుతగ్గులకు లోనవుతుంది కానీ బంగారం ధర చాలా కాలం పాటు స్థిరంగా ఉంటుంది.
- కరెన్సీ విలువ తగ్గుతుందని పెట్టుబడిదారులు భయపడినప్పుడు బంగారాన్ని కొనుగోలు చేస్తారు.
- డాలర్ బలహీనపడినప్పుడు, బంగారం బలపడుతుంది.
- కేంద్ర బ్యాంకులు ద్రవ్యలోటును ఎదుర్కొంటున్నప్పుడు, పెట్టుబడిదారులు తమ సంపదను కాపాడుకోవడానికి బంగారం వంటి స్పష్టమైన ఆస్తులను కొనుగోలు చేస్తారు.
- వడ్డీ రేట్లు తగ్గినప్పుడు, ఇతర పెట్టుబడులతో పోలిస్తే బంగారాన్ని నిల్వ చేసుకోవడానికి అవకాశ వ్యయం తక్కువగా ఉంటుంది. కాబట్టి బంగారం ధరలు పెరుగుతాయి.
- కేంద్ర బ్యాంకులు బంగారాన్ని నిల్వగా పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు, కరెన్సీ సరఫరా పెరిగి బంగారం లభ్యత తక్కువగా ఉండటం వల్ల బంగారం ధరలు పెరుగుతాయి.
- భారతదేశం, చైనాలో ఆభరణాలకు భారీ డిమాండ్ ఉంది. పారిశ్రామిక అనువర్తనాల నుంచి కూడా బంగారానికి గొప్ప డిమాండ్ ఉంది.
- ఉత్పత్తి వ్యయం దాని ధరను ప్రభావితం చేస్తుంది. ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉన్నప్పుడు, మైనర్లు(ఉత్పత్తిదారులు) తమ లాభాలను కాపాడుకోవడానికి బంగారాన్ని ఎక్కువ డబ్బుకు అమ్ముతారు.
- ఆర్థిక పరిస్థితులు బంగారాన్ని మరింత ఆకర్షణీయంగా చేసినప్పుడు, డిమాండ్ పెరుగుతుంది, దీనివల్ల దాని ధర పెరుగుతుంది.



### 'తులం బంగారం'పై ఎఫెక్ట్

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో తులం బంగారం కూడా ఒకటి. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీల్లో వీలును బట్టి ఒక్కోదానిని అమలు చేస్తూ పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం హామీని కూడా నెరవేర్చాలని భావించిన సమయంలోనే పుత్తడి ధర ఆకాశానికి ఎగబాకుతుండటంతో వేచిచూసే ధోరణితో ఉందని ప్రభుత్వ వర్గాల సమాచారం. అమెరికా టారిఫ్ భయాలు తొలగి ధర తగ్గితే అప్పుడు అమలు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

### తర్వాతి తరానికి ఆస్తి బదిలీ

ప్రపంచవ్యాప్తంగా కరెన్సీలకు బంగారాన్ని ప్రామాణిక విలువగా చూస్తారు. స్టాక్స్ తగ్గినప్పుడు, బంగారం పెరుగుతుంది. బంగారంలో పెట్టుబడి పెట్టడం వల్ల మీ పోర్ట్‌ఫోలియో సమతుల్యం అవుతుంది. ఆర్థిక అనిశ్చితి సమయాల్లో బంగారం కూడా మెరుగ్గా పనిచేస్తుంది. డాలర్ విలువలో ఏదైనా తగ్గుదల కనిపించినప్పుడు బంగారం ధర పెరుగుతుంది. బంగారం అనేది తరువాతి తరానికి సంపదను బదిలీ చేయడానికి ఒక వివేకవంతమైన పద్ధతి.

### భారత్ వద్ద 879 టన్నుల బంగారం

ప్రపంచంలో అత్యధిక బంగారం నిల్వలున్నది ఒక్క అమెరికాలోనే. ఆ దేశం మొత్తం 8,133.46 టన్నుల బంగారాన్ని కలిగి ఉంది. ఇది అమెరికా విదేశీ మారక నిల్వలో 72.41 శాతం. అమెరికా తర్వాతి స్థానంలో జర్మనీ ఉంది. ఆ దేశం వద్ద 3,351.52 టన్నుల పసిడి నిల్వలున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఇటలీ (2,451.84 టన్నులు), ఫ్రాన్స్ (2,436.97 టన్నులు), చైనా (2,289.52 టన్నులు), రష్యా (2,039.63) ఉన్నాయి. భారతదేశం వద్ద 879.6 టన్నుల బంగారం నిల్వలు మాత్రమే ఉన్నాయి. భారత విదేశీ మారక నిల్వలో ఇది 11.7 శాతం మాత్రమే.

# పిల్లలను నరికి

## ఆత్మహత్య చేసుకున్న తల్లి.. జీడిమెట్లలో విషాద ఘటన



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజుల రామారం ప్రాంతంలో ఓ హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో మానసికంగా చితికిపోయిన ఓ తల్లి, తన ఇద్దరు చిన్నారులను వేట కొడవలితో నరికి, అనంతరం బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ దారుణ ఘటన మృతిచెందిన తల్లి తేజస్విని రెడ్డిగా, ఆమె కుమారులు హర్షిత్ రెడ్డి (7), ఆశిష్ రెడ్డి (5)గా పోలీసులు వెల్లడించారు. తేజస్విని తన చిన్న కొడుకు ఆశిష్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, పోలీసులు రామ్రాజ్ అసుపత్రికి తరలించారు. అయితే మార్గ మధ్యలోనే ఆశిష్ మృతి చెందాడు. అయితే.. హర్షిత్ రెడ్డి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. తేజస్విని రెడ్డి, ఈ ఘటనకు ముందు ఆరుపేజీల సూసైడ్ నోట్ రాసి ఉంచింది. సూసైడ్ నోట్‌లో ఆమె తన మనోవేదనను, కుటుంబపరమైన ఒత్తిడులను వివరించినట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలానికి బాలనగర్ డీసీపీ, జీడిమెట్ల సీఐలు చేరుకుని క్లూస్ టీమ్ తో పరిశీలనలు చేపట్టారు. ఈ సంఘటన గాజులరామారంలో తీవ్ర విషాదాన్ని నెలకొల్పింది.

# ఎమ్మెల్యేలకు కేటాయించిన భూములు స్వాధీనం

## పుప్పాలగూడ భూముల్లో ఐటీ టవర్స్ నిర్మిస్తాం

## ఉన్నతస్థాయి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** హైదరాబాద్ నగరంలోని పుప్పాలగూడలో ఎంపిలు, ఎమమెల్యలేఉ, ఐఎఎస్, ఐపిఎస్‌లకు ఇచ్చిన భూమిని స్వాధీనం చేసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఉమ్మడి ఎపిలో నాటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీరికి భూమి కేటాయించారు. అయితే ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఇటీవల సుప్రీం తీర్పును ఇచ్చింది ఈ క్రమంలో ఈ భూమితో పాటు పరిసరాల్లో 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పుప్పాలగూడ భూముల్లో ఐటీ హబ్ ఏర్పాటుపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, రెవెన్యూ, స్పెషల్ పోలీస్ సొసైటీలకు కేటాయించిన ఈ భూమిలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ సొసైటీలకు 200 ఎకరాల భూ కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. పక్కనే ఉన్న మరో 250 ఎకరాల టీజీఐఐసీ భూములు కలిపి ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ ఐటీ నాలెడ్జ్ హబ్‌తో 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ప్రకృతి

# పల్లె నుంచి పాన్ ఇండియా స్థాయికి..



ఓ బావా సైదులు అపవయ్యా పరుగులు అంటూ జానపద ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఓ పల్లెటూరి గాయనీ ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. చిన్నతనం నుంచే పాటలతో సహాజీవనం చేస్తూ పాటల ప్రపంచం లో కొత్త గుర్తింపును తెచ్చుకుంది దాసలక్ష్మి.. ఆనాడేమన్నంటినా తిరుపతి నిన్న ఈనాడేమన్నంటినా తిరుపతి...తిన్నాతీరం పడుతలే..కూసున్న తీరం పడుతలే..ఏడున్న తీరం పడుతలే వంటి జానపద గీతాలతో అలరించిన లక్ష్మి తాజాగా విడుదలైన పుష్ప-2 చిత్రంలో వచ్చుండయ్ ఫీలింగ్స్ అంటూ పాడి పాన్ ఇండియా స్థాయి సింగర్ గా మారిన తీరు వెనుక తన ఇష్టాలు, కష్టాలను నేటి ప్రస్తానంతో ఇలా పంచుకుంది.

మాది ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ జిల్లా ముధోల్ మండలం గన్నోర మారుమూల గ్రామం. మా నాన్న దాస లక్ష్మణ్, అమ్మ జయశీల. మా నాన్న భజన కీర్తనలు పాడేవాడు. అమ్మ వాళ్లది మహారాష్ట్ర అందుకే ఆమె ఎక్కువగా మరాఠి పాటలు పాడేది. అలా చిన్నతనంలోనే పాటలంటే మక్కువ పెరిగింది. మా ఊరి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి వరకు చదువుకున్న. బడిలో పంద్రాగస్టుకు, గణతంత్ర దినోత్సవానికి నాతో పాటలు పాడించేటోళ్లు. శశికళ మేడం, ప్రవీణ్ రెడ్డి సార్, రాములు సార్ నా పాటలు మెచ్చుకునేటోళ్లు. ఎక్కడ పాటల పోటీలు ఉన్నా తీసుకపోయేటోళ్లు. అప్పుడు మండల, జిల్లా స్థాయి పాటల పోటీల్లో గెలిచిన. ఏడో తరగతి చదువుతున్నప్పుడు తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినయి. అక్కడికి తీసుకుపోయిండ్లు. అక్కడ కూడా పాడిన.





## యూత్ ఫెస్టివల్‌లో నాకు రెండో స్థానం

మా ఊరిలో 8వతరగతి వరకే ఉండే. తొమ్మిదవ తరగతి చదవడానికి పక్కనున్న అష్ట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరా. ఆ సమయంలో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నది. 'తెలంగాణ ధూం ధాం' సభలు బాగా జరిగేటివి. ఒకసారి మా బడిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో పాట పాడిన. ఆ సమయంలో దిగంబర్ అనే గాయకుడు పాట విని మెచ్చుకున్నడు. ఆ అన్న పాటల్లో చాలా మెలకువలు నేర్పించారు. ఆ సమయంలోనే తెలంగాణ ఉద్యమం సాగుతోంది. దిగంబరన్న 'ధూం ధాం', యూత్ ఫెస్టివల్స్‌కి నన్ను తీస్కవోయేటోడు. జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్‌లో నాకు రెండో స్థానం లభించింది. నాకు పాట మీదా మరింత ప్రేమ పెరిగింది. నేనూ పాడగలనన్న నమ్మకం కుదిరింది.



## ఓ బావ సైదులుతో దశ తిరిగింది


ఇంటర్ తర్వాత డిగ్రీలో చేరిన అప్పుడే యూట్యూబ్ ట్రెండింగ్ స్టార్ట్ అయింది. డిగ్రీ ఫస్ట్ ఇయర్ల ఉన్నప్పుడు.. ఫ్రెండ్స్ యూట్యూబ్ పాటలు వినేటోళ్లు. నాకు అప్పటికి ఫోన్ లేదు. వాళ్ల ఫోన్‌లోనే వినేదాన్ని. ఒకసారి 'గడ్డం మ్యూజిక్' అనే చానెల్‌లో పాటలు విన్న. అవి బాగున్నయి. ఆ చానల్ నడిపే గడ్డం రమేశ్ అన్నను కలిసిన. అవకాశం ఉంటే చెప్తా అన్నాడు. అన్నట్లుగానే 2017లో గడ్డం రమేష్ అన్న "ఓ బావ సైదులు" పాట పాడించారు. ఆ ఒక్కపాటతో ఫోక్ సాంగ్ ఫ్యాన్స్‌లో పాపులర్ అయ్యా. ఆ తర్వాత యూట్యూబ్ చానెల్స్‌కి లెక్కలేనన్ని పాటలు పాడాను. ఫోక్ మ్యూజిక్ డైరెక్టర్ జీఎల్ నామ్‌దేవ్ సార్ పాటను ఏ శ్రుతిలో పాడాలి? ఎట్ల ఎత్తుకోవాలో బాగా నేర్పిండు. వందల పాటలు పాడిన. మాట్ల తిరుపతి అన్న నడిపే సైటీవీ చానెల్‌లో పాడిన 'ఆనాడేమన్న అంటినా తిరుపతి.. నిన్న ఈనాడేమన్న అంటినా తిరుపతి' పాటతోపాటు 'తిన్నా తిరం పడుతలే.. కూసున్న తిరం పడుతలే' పాటలు యూట్యూబ్‌లో ట్రెండింగ్ సృష్టించాయి. ఇప్పటికే 400 వందలకు పైగానే పాటలు పాడి ఉంటా.

## వెండితెర వైపు అడుగులు

నా పాటలు యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉండడంతో సినిమా ఇండస్ట్రీ గుర్తించింది. అలా కొన్ని సినిమాలకు పాడిన. రఘు కుంచె గారు నాకు మొదటిసారి సినిమాలో పాడే చాన్స్ ఇచ్చారు. 'బ్యాచ్' సినిమాలో 'గుంటడు గుళ్లో కాసేనే' పాట పాడించారు. ఆ పాట కోస్తాలో పాపులర్ అయింది. తర్వాత దసరా సినిమాలో కాసర్ల శ్యామ్ అన్న అచ్చమైన తెలంగాణ యాసలో టైటిల్ సాంగ్ 'ధూమ్ ధామ్ దోస్తాన్' పాడించారు.

## వచ్చుండయ్ ఫీలింగ్స్ అంటూ...

నా పాటలు విన్న సినిమా డైరెక్టర్ సుకుమార్ సార్ 'ఈ అమ్మాయి వాయిస్ బాగుంది. మాస్‌గా, రొమాంటిక్‌గా, మంచి బేస్‌లో ఉంది. పుష్ప-2లో పాడిద్దామనుకుంటున్నా' అని మాట్ల తిరుపతి అన్నకు ఫోన్ చేసి చెప్పాడట. అలా నన్ను చెన్నైకి పిలిపించారు డైరెక్టర్ సార్. దేవీశ్రీప్రసాద్ గారి సంగీత దర్శకత్వంలో 'పీలింగ్స్' పాట పాడిన. ఈ పాట నన్ను చెప్పలేనంత పాపులర్ చేసింది. ఇప్పుడు దాస లక్ష్మి అంటే తెలియనోళ్లు లేరు. పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అల్లు అర్జున్ సార్, సుకుమార్ సార్ నన్ను పిలిచి, 'అమ్మా లక్ష్మి నీ టోన్ వెరీ డిఫరెంట్. మా సినిమాలో ఈ పాటకు ఏ ఫీల్ కావాలో ఆ ఫీల్ నీ గొంతులో ఉంది. నువ్వు మాస్ పాటే కాకుండా అన్ని రకాల పాటలు పాడగలవు' అని మెచ్చుకున్నారు. ఈ ప్రశంస నాకెంతో స్ఫూర్తినిచ్చింది. ఆ ఫీలింగ్ ఎప్పటికీ మర్చిపోలేను. పుష్ప-2 తర్వాత అవకాశాలకు కొదవలేకుండా పోయింది. వాటిని సద్వినియోగం చేసుకొని మంచి సింగర్‌గా గుర్తుండిపోవాలన్నది నా కోరిక.



- మధుకర్ వైద్యుల, సీనియర్ జర్నలిస్ట్

# మెట్రో మోత తప్పదా?

### చార్జీల పెంపునకు రంగం సిద్ధం

**హైదరాబాద్ ప్రతినిధి, నేటి ప్రస్థానం:** ఇప్పటికే పీకలోతు కష్టాల్లో ఉన్న మెట్రో సంస్థ చార్జీల పెంపునకు రంగం సిద్ధం చేసిందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కోవిడ్ సమయంలో ప్రయాణికులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ఈ సంస్థ రూ.6500 కోట్ల నష్టాలను చవిచూసింది. ఈ కష్టనష్టాల నుంచి నుంచి బయటపడాలంటే చార్జీలు పెంచడం ఒక్కటే పరిష్కారంగా భావించి ప్రభుత్వానికి ఎల్అండ్‌టీ సంస్థ నివేదిక అందజేసింది. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో పెంపు నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వస్తోంది.



### ఇక తప్పదా..

వరుస నష్టాలు మూటగట్టుకుంటున్న మెట్రో ఇక చార్జీల పెంపు తథ్యమంటున్నది. ప్రభుత్వ నిర్ణయంపై వేచి చూస్తున్నది. ఇదిలా ఉంటే ప్రస్తుతం బెంగళూరులో 44శాతం మెట్రో చార్జీలు పెరగగా.. హైదరాబాద్‌లో ఎంత పెంచాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నది. ఇప్పటికే రూ.59ల హాలీడే సేవర్ కార్డు రద్దుతో పాటు, రద్దీ వేళల్లో మెట్రోకార్డుపై ఉన్న 10శాతం డిస్కౌంట్‌ను సైతం ఎత్తివేసిన విషయం విదితమే.

## ఈడీ కార్యాలయ ముట్టడికి తరలిన కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

### కూకట్ పల్లి నుండి ఈడి కార్యాలయానికి భారీ ఎత్తున ర్యాలీ




**కూకట్‌పల్లి, నేటి ప్రస్థానం ::** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఈడీ చార్జ్‌షీట్‌లో చేర్చడంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు కూకట్ పల్లి కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కూకట్ పల్లి మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.నియోజకవర్గ ఇన్ ఛార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై, ఈడీ కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన సీబీఐ, ఈడీలను బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధించేందుకు ఉపయోగిస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలను అణచివేసేందుకు బీజేపీకి అవి జేబు సంస్థలుగా మారుస్తోందని మండిపడ్డారు. ప్రజలు ఈ కుట్రలను గమనిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కాంగ్రెస్ సీనియర్ నేతలు సాదు ప్రతాపరెడ్డి, మేకల మైఖేల్, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, రేష్మ నాయుడు, తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్ పుత్, మొయినుద్దీన్, మేకల రమేష్, మగ్దుం, నితీష్ గౌడ్, శివ చౌదరి,ప్రకాష్ స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తార్నాక జంక్షన్‌లో నేటి నుచి రాకపోకలు

### యూటర్న్‌లు ఎత్తేసిన ట్రాఫిక్ పోలీసులు

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** గత కొన్ని రోజులుగా మూసి ఉన్న తార్నాక జంక్షన్ మళ్లీ వాహనదారులకు అందుబాటులోకి రానుంది. తార్నాక జంక్షన్‌ను రీ ఓపెన్ చేసేందుకు సిటీ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ వైపు నుంచి లాలాపేట్ వైపు వాహనాలు నేరుగా రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారంనుంచి మే 2 వరకు ట్రయల్ రన్ నిర్వహించ నున్నారు. మొత్తం 15 రోజుల ట్రయల్ రన్ అనంతరం.. శాశ్వతంగా ఆ జంక్షన్‌ను వినియోగంలోకి తీసుకురానున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం తార్నాక జంక్షన్ క్లోజ్ చేసి ఉండటం వల్ల ఉస్మానియా వర్సిటీ, లాలాపేట మధ్య నేరుగా రాకపోకలు సాగించే వీలు లేకుండా పోయింది. వర్సిటీ నుంచి లాలాపేట వెళ్లాలంటే తార్నాక జంక్షన్ నుంచి మెట్టగూడ వైపు ముందుకు వెళ్లి యూ టర్న్ తీసుకోవాల్సి వస్తోంది. అలాగే.. లాలాపేట్ నుంచి వర్సిటీ వైపు రావాలంటే తార్నాక జంక్షన్ నుంచి హబ్సిగూడ వైపు ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. దీంతో సమయంతో పాటు ఇంధనం కూడా వృథా కావడంతో ప్రయాణికులు నిరసలను తెలిపారు. ఇప్పటికే పెట్రోల్ ధరలు సెంచరీ దాటి చుక్కలు చూపిస్తుండగా.. ఈ యూటర్న్‌లు వాహనదారులుగా ఇబ్బందిగా మారాయి. ఈ నేపథ్యంలో తార్నాక జంక్షన్‌ను తెరవాలని గతకొద్ది రోజులుగా వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. వారి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు.. మళ్లీ జంక్షన్‌ను రీ ఓపెన్ చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో తార్నాక ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో కూడా ఇలాంటి పరిస్థితి ఉంది. దీనిని కూడా పునరుద్ధరించాలని కోరుతున్నారు.





## బాల్య వివాహం నేరం

### సంరక్షణ అధికారి ఎన్ స్వామి

### బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

### తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

నేటి ప్రస్థానం, ఆదిలాబాద్: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డీసీపీయూ సంరక్షణ అధికారి ఎన్ స్వామి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు 1098కి వచ్చిన సమాచారం మేరకు గురువారం చైల్డ్ వెల్ఫేర్, డీసీపీయూ, చైల్డ్ లైన్, ష్యూర్ ఎన్జీవో, పోలీసులు కలిసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంరక్షణాధికారి ఎన్ స్వామి మాట్లాడుతూ.. బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేయడం తప్పన్నారు. బాల్య వివాహం నిషేధ చట్టం ద్వారా రెండు లక్షల జరిమానా, సంవత్సరపాటు జైలుశిక్ష విధించడం జరుగుతుందని వివరించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాత, అబ్బాయికి 21 సంవత్సరం నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలన్నారు. అమ్మాయికి 16 సంవత్సరాలు, అబ్బాయికి 18 సంవత్సరాలు ఉన్నాయని ఇద్దరు మైనర్లేనని తెలిపారు. ఇలా పెళ్లి చేయడంతో వారి ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. అమ్మాయి, అబ్బాయి తల్లితండ్రుల నుంచి బాల్య వివాహం చేయమని ఒప్పంద పత్రాన్ని రాసి ఇచ్చారు. చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ పద్మజారాణి, కేస్ వర్క శ్రీకాంత్,షూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ కె.వినోద్, ఏఎస్ఐ లింగన్న లు ఉన్నారు. కాగా, బాలిక గర్భవతి అని తెలిసింది.

## గ్రూప్-1 నియామకాలకు బ్రేక్

### పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించిన హైకోర్ట్




**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలిసారి జరిగిన గ్రూప్-1 నియామక పక్రియకు బ్రేక్ పడింది. గ్రూప్-1 నియామక పక్రియను ఆపాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టులో విచారణ పూర్తి అయ్యే వరకు ఎంపిక అయిన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని ఆదేశించింది. అయితే.. అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరికేషన్ మాత్రం కొనసాగించవచ్చని హైకోర్టు తెలిపింది. కాగా, గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు- తెలంగాణ హైకోర్టులో దాదాపు 20 పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఈ పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. కేసు విచారణ పూర్తి అయ్యే వరకు ఎంపి-కై-న అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని టీ-జీపీఎస్సీని ఆదేశించింది. దీంతో గ్రూప్ 1కు ఎంపికైన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఇదిలావుంటే గ్రూప్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశికం రెడ్డి ఆరోపించారు. దీనిపై సిబిఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఒకే సెంటర్‌లో పరీక్షలు రాసిన వారంతా పాస్ కావడం, సెలెక్ట్ కావడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు.

## కాంట్రాక్ట్ టీచర్ల గాంధీభవన్ ముట్టడి

### పోస్టులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణ రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తూ గాంధీభవన్‌ను ముట్టడించారు. మొత్తం 12 విశ్వవిద్యాలయాల్లో సుమారు 1,400 మంది కాంట్రాక్ట్ టీచర్లు పనిచేస్తున్నారు. వీరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీ-చర్స్ జేఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సామర్ల విజయేందర్ రెడ్డి నాయకత్వంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేస్తామని చెప్పిన మాటలను మరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది గడుస్తున్నా, ఈ విషయంపై ఏ ఆలోచన కనిపించడం లేదని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంట్రాక్ట్ టీ-చర్లు తీవ్ర అనిశ్చితిలో ఉన్నారని, తమ కుటు-ంబాలను పోషించలేని దుస్థితి నెలకొన్నదని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు కూడా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని, అందుకే చివరికి రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పటి-కై-నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, తమ హామీలను నిలబెట్టు-కుని యూనివర్సిటీ కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని వారు కోరారు. లేకపోతే, తమ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

